దీ క్రైమ్ న్యూస్ (Crime News)

తెలుగు దినపత్రిక

బుధవారం, మే 13, 2026 | సంపుటి - 20 | సంచిక 236 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం
- సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి

న్యూఢిల్లీ : జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది.




## ధాన్యం సేకరణలో

# నిర్లక్ష్యం సహించం

### సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు

### ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే

- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

> "ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు."



హైదరాబాద్ : మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తరువాయి 2లో

## నీట్ పేపర్ లీకేజీకి

# బాధ్యత కేంద్రానిదే

- పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్ : దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న 2లో



# ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

### రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం

### స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మే12 : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు తరువాయి 2లో

## తమిళ సిఎం విజయ్

# సంచలన నిర్ణయం

- బడులు, గుడులు,బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత
- రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ





## పోక్సో కేసులో

# కుల ప్రసక్తి ఉండదు

- చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది
- పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్

2

## ఆనాటి జైళ్లు

# దుర్భరంగా ఉండేవి

- బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
- తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
- చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్




హైదరాబాద్ : స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. పూర్వం జైల్లో గడిపిన ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. 2లో

## జగన్‌వి నీతి మాలిన

# రాజకీయాలు

- అభివృద్ధి అంటే గిట్టని వైసిపి నేత
- అమరావతిని చూసి ఓర్వలేక మావిగన్ జపం
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర



# టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాక్

- ఒక్కోటుతో గెల్చిన సేతుపతిని ఓటింగ్‌కు దూరం
- విశ్వాస పరీక్షలో ఓటేయవద్దని హైకోర్టు ఆదేశం

చెన్నై : తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న వేళ ఒక టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో నెగ్గిన ఆ ఎమ్మెల్యే.. సభలో సీఎం విజయ్ బలపరీక్షలో పాల్గొనవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తరువాయి 2లో

# కొత్తగా 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు

- దశల వారిగా 1275 ఖాళీల భర్తీ
- పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యం
- అధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత



అమరావతి : కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై అనిత సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు. తరువాయి 2లో



# లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

## నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ : నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు.దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది.విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు

మచిలీపట్నం : మూడు రాజధానుల వ్యవహారం ముగిసినా..ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ విన్యాసాలు చేస్తున్నారని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుడి చూపు రాష్ట్రంపై పడకూడదని నాడు ఆయన తండ్రే తరిమేశారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి రాష్ట్రంపై తన దుర్మార్గాలకు శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకం సృష్టించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహించారు. భూములిచ్చిన రైతన్నలను పోలీసుల లాఠీలతో కొట్టించి, బూటు కాళ్లతో తన్నించారని విమర్శించారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసినోళ్లు కూడా నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా ప్రజల ఆస్తులను దోచారని మండిపడ్డారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకుని అమరావతి నిర్మాణంపై నిందలేయడం సిగ్గుచేటని అన్నారు. మావిగన్ అంటూ ఇప్పుడు మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లు ఏం చేశారు..? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప వైసీపీ నేతలు సొంత బుర్రలు వాడటం మానేశారని సెటైర్లు గుప్పించారు. అమరావతే రాజధాని అని ఒకసారి.. మూడు రాజధానులని మరోసారి.. ఇప్పుడు మావిగన్ అంటూ నీతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని వైసీపీ నేతలు జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా..? అని నిలదీశారు. మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాయలసీమకు గతంలో కియా, ఇప్పుడు డ్రోన్స్, డిఫెన్స్, రాయల్ ఎన్ ఫీల్డ్ తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో భోగాపురం, గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న బియ్యం దొంగ ఐదేళ్లలో బందరు పోర్టు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని తన స్థాయి మరిచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురించి మాట్లాడుతున్నారని కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

హైదరాబాద్ : తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాక్

దాంతో విజయ్ బలపరీక్షలో టీవీకే కూటమి బలం 119 సీట్లకు పడిపోయినట్లయ్యింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ నియోజకవర్గం నుంచి టీవీకే నేత శ్రీనివాస సేతుపతి విజయం సాధించారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెరియకరుప్పన్‌పై కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో సేతుపతి గెలుపొందారు. డీఎంకే నేత పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పోలవగా.. శ్రీనివాస సేతుపతి 83,375 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే ఈ ఫలితాలపై డీఎంకే నేత పెరియ కరుప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు పక్రియలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కాబట్టి తిరుప్పత్తూర్‌లో రీకౌంటింగ్ జరపాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అప్పటివరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెరియకరుప్పన్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. విజయ్ విశ్వాసపరీక్ష ఓటింగ్‌లో శ్రీనివాస సేతుపతి పాల్గొనవద్దని ఆర్డర్ వేసింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలతో బలపరీక్షలో విజయ్‌కు ఒక ఓటు తగ్గినట్లయ్యింది. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్‌కి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ కలుపుకుని ప్రస్తుతం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అందులో ఇప్పుడు ఒక ఎమ్మెల్యే బలపరీక్షలో పాల్గొనే అవకాశం లేకపోవడంతో విజయ్ బలం 119కి తగ్గిపోయింది. అయితే విజయ్ బలపరీక్షలో నెగ్గేందుకు మాత్రం ఎలాంటి అవాంతరం లేదు. విజయ్ బలపరీక్షలో నెగ్గడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు సరిపోతుంది. శ్రీనివాస సేతుపతికి బలపరీక్షలో ఓటువేసే అవకాశం లేకపోయియినా.. 119 ఓట్లతో విజయ్ బలపరీక్షలో నెగ్గనున్నారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు.అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నిం టినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు.




ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత కేంద్రానిదే

బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు.నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## కొత్తగా 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు

జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక పక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని హోంమంత్రి అనిత సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ పొడిగింపులకు ÷ర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లలో ÷ర్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశర చేశారు. 'ఆపద మిత్ర' తరహాలో యువతకు స్వచ్ఛంద సేవా శిక్షణను విస్తరించాలని సూచించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ విపత్తు నిర్వహణ విధానాలపై అధ్యయనం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ నమూనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అత్యవసర సేవలను 112 సేవలతో సమన్వయం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించు కుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

# అన్నా డిఎంకెలో లుకలుకలు

**పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు**

**టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం**

చెన్నై,మే12 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు.

# బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

## అత్యాచారాలకు పాల్పడడమే బీజేపీ భేటీ బచావో నా?

## బండి సంజయ్‌ని మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలి

## అంబేద్కర్ విగ్రహం ముందు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేసిన కెవిపిఎస్, టి పి టి ఎఫ్ నాయకులు



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అత్యాచారాలకు పాల్పడడమే బీజేపీ భేటీ బచావో నా? సాక్షాత్తు కేంద్ర సహాయ మంత్రి కుమారుడు మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడితే ఇప్పటివరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే బండి భగీరథను అరెస్టు చేయాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కెవిపిఎస్, టిపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీప అంబేద్కర్ విగ్రహం ముందు కెవిపిఎస్ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో కండ్లకు నల్లగంతలు కట్టుకొని అత్యాచారానికి పాల్పడ్డ బండి భగీరథను అరెస్టు చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్ మాట్లాడుతూ17 ఏళ్ల బాలికపై మద్యం తాగించి హత్యాచారం చేసిన బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.మద్యం తాగించిఅత్యాచారానికి పాల్పడ్డాడని తన తల్లిని తోడుకొని వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే 8 గంటల పాటు పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడం పోలీసుల వైఖరి ఏమిటో అర్థం అవుతుందన్నారు.చట్టం ముందు అందరూ సమానులే అనేవిదంగా రాజ్యాంగబద్ధంగా పోలీసులు వ్యవహరించాలని చెప్పారు. బండి సాయి భగీరథ తన తండ్రి కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్నాడనే అండదండతో తాను చదువుకున్న టెక్ మహేంద్ర విద్యాసంస్థలో ర్యాగింగ్ కు భౌతిక దాడులకు పాల్పడటం, మద్యం మత్తులో సహ విద్యార్థులపై అరాచకాలు చేయడం అయన ఆరాచకాలు పరిపాటిగా మారిందన్నారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా తమను హనీ ట్రాప్ చేశారని కేసులు తప్పుదోవ పట్టించడానికి కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. ఓ17 ఏళ్ల యువతీ తన నిండు భవిష్యత్తును పాడు చేస్తున్నాడని మొయినాబాద్ ఫామ్ హౌస్ లో తనకు మద్యం తాగించి మద్యం మత్తులో తనను నానా రకాల ఇబ్బందులు పెట్టారని తన తల్లితో కలిసి బెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుకి వస్తే పోలీసులు గంటల తరబడి నిరీక్షింపజేసి ఫిర్యాదు స్వీకరించారని చెప్పారు. తక్షణమే మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన సాయి భగీరథ పై ఫోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బేటి బచావో బేటి పడావో వంటి అనేక నినాదాలు ఇస్తున్న బిజెపి సంస్కారం రేపిస్టులకు సత్కారాలు చేయటం అత్యాచారాలు చేయడంతో వారికి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి చాటుకుంటున్నారని చెప్పారు.దేశం కోసం ధర్మం కోసం అంటూ దేశ ప్రజలను బుకాయిస్తున్నటువంటి మతోన్మాదులు మహిళల జీవితాలతో చలగాటమాడుతున్నారని చెప్పారు. కేంద్ర హోం మంత్రి రాష్ట్ర ప్రభుత్వ నేతలను పోలీసులను ప్రభావితం చేయడమే కాకుండా బాధిత యువతి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఆ యువతికి ప్రాణహాని పొంచి ఉందని తక్షణమే సాయి భగీరథను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఆ యువతీని ఫోన్లో బెదిరించాడని ఇంటికి పిలిపించి వార్నింగ్ ఇచ్చాడని అందుకుగాను బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి దేశభక్తి మాటలు భారత్ మాతాకీ జై అనే నినాదాలు వట్టి నీటి మూటలేనని ఇలాంటి ఘటనలు కోకోల్లలుగా జరిగాయని చెప్పారు.సాయి భగీరథను అరెస్ట్ చేయకపోతే సామాజిక ప్రజాసంఘాలు విద్యార్థి సంఘాలు మహిళా సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి గుమ్మడి కొమరయ్య, కెవిపిఎస్ నాయకులు అరికిళ్ల రామలక్ష్మి, కుమ్మరి నవీన్ విజయ చిలకమ్మా, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్.

కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్) : తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం పట్ల కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు . ఎడ్ల జోగిరెడ్డి హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. తిమ్మాపూర్ మాజీ జెడ్పిటిసి ఎడ్ల భాగ్య భర్త ఎడ్ల జోగి రెడ్డి, గతంలో తిమ్మాపూర్ ఎంపీటీసీగా, తెలంగాణ ఉద్యమంలో ఎడ్ల జోగి రెడ్డి క్రియాశీలకంగా పనిచేశారు.ప్రస్తుతము తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకునిగా, బిజెపి జిల్లా నాయకునిగా కొనసాగుతున్నారు. తిమ్మాపూర్ మండల ప్రజలకు సుపరిచితుడైన ఎడ్ల జోగి రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు.గత రెండు రోజుల క్రితం ఎడ్ల జోగిరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం తిమ్మాపూర్ మండలంలోబీజేపీ పార్టీకి తీరని లోటు లాంటిది. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.సంతాపం వ్యక్తం చేసిన కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ లు ఎడ్ల జోగి రెడ్డి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## ఐఐఐటి -హైదరాబాద్ యూజీ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రభంజనం




కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్)కరీంనగర్ ప్రతిష్టాత్మకమైన ఐఐఐటి–హైదరాబాద్ నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ – 2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సంస్థకు చెందిన విద్యార్థులు వూట్కూరి శ్రేయాన్రెడ్డి, గుజ్జుల అశీష్రెడ్డి,గంగడి ఛైత్ర ఉత్తమ ఫలితాలు సాధించి, తదుపరి దశలో జరిగే ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల నిరంతర కృషి, క్రమశిక్షణ వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. కఠినమైన పోటీ పరీక్షల్లో సైతం అల్ఫోర్స్ విద్యార్థులు తమ సత్తా చాటడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో కూడా ఇదే ఉత్సాహంతో పాల్గొని ఐఐఐటి–హైదరాబాద్‌లో సీట్లు సాధిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను,వారికి సహకరించిన అధ్యాపకులను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు

## చికిత్స పొందుతూ ఎడ్ల జోగి రెడ్డి మృతి



తిమ్మాపూర్, మే12(ది క్రైమ్ న్యూ.స్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు.గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జోగి రెడ్డిని రెండు రోజులక్రితం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి జోగిరెడ్డి మృతి చెందడంతో బిజేపి పార్టీలో, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జోగిరెడ్డి మృతి పట్ల మండలంలోని వివిధ పార్టీల నాయకులు,ప్రజా సంఘాలు,తెలంగాణ ఉద్యమకారులు, బిజేపి శ్రేణులు, గ్రామస్తులు ఆయన కుటుంబానికి తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని జోగి రెడ్డికి తుది వీడ్కోలు పలికారు.

## ప్రతి రైతు పచ్చిరొట్ట వాడాలి.

### శాస్త్రవేత్త అర్చన

రామగిరి,మే 12(ది క్రైమ్ న్యూస్):– రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట వాడాలి అని జగిత్యాల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. అర్చన అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని సిద్ది పల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.అర్చన మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం తగ్గించాలని రసాయన మందుల వినియోగంతో వాతావరణం కాలుష్యమై ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు.

## అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు





కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్) : ఆంజనేయుడిని కొలిచిన వారికి సకల శుభాలు కలుగుతాయని మరియు చేసేటువంటి పనులలో ఆటంకాలు తొలగిపోతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి పరివారంతో కలిసి కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్నటువంటి హనుమాన్ ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయుడు చాలా గొప్ప గురుభక్తి గలవాడని, అతడిని కొలిచిన వారికి అన్ని విధాలుగా లాభాలు చేకూరుతాయని వారు చెప్పారు.శ్రీరాముని యొక్క మార్గాన్ని అనుసరిస్తూ ఎటువంటి నిర్లక్ష్యం మరియు ఆలస్యం లేకుండా చెప్పిన విధానాన్ని అమలుపర్చి తన కార్యాలను అమలుపరిచి సత్ఫలితాలు పొందాడని వారు చెప్పారు.హనుమాన్ జయంతి నాడు ప్రతి ఒక్కరూ ఉపవాసాన్ని పాటిస్తూ హనుమాన్ చాలీసా ను పటిస్తారని నేటికీ మన భారతదేశంలో హనుమాన్ జయంతిని పండుగగా నిర్వహించడం వస్తున్నదని,వైశాఖ శుద్ధ దశమి నాడు హనుమాన్ జయంతిని జరుపుకోవడం గొప్ప విశేషం అని గుర్తు చేశారు.ఆంజనేయుడు ప్రతి ప్రదేశంలో ఉంటాడని ఆంజనేయుడు బలవంతుడుమని, ధైర్యవంతుడని, సద్గుణవంతుడని కొనియాడారు. హనుమాన్ జయంతికి భారతదేశ చరిత్రలో ప్రత్యేకత ఉన్నదని మరియు హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంజనేయుడిని వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలలో కొలుస్తానని వారు తెలిపారు.జయంతిని పురస్కరించుకొని వారు ఆంజనేయునికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారు. ఈ కార్యక్రమం బ్రహ్మశ్రీ డా.గర్రెపల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకమున నిర్వహించడం జరిగినది చెప్పారు.నరేందర్ రెడ్డి పరిమాణాన్ని మృత్వికుల బృందం ఘనంగా ఆశీర్వదించి చేపట్టబోయే కార్యక్రమాలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యాసంస్థల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైడ్ డ్రైనేజీ వాటర్‌తో పంటపొలాలకు ముప్పు

### -సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీవో శైలజ రాణి

### -సర్పంచ్ పల్లె ప్రతిమ- పివి రావు



రామగిరి, మే 12 : –సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైడ్ డ్రైనేజ్ వాటర్ తో పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని మంథని ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 4, తేదీన ప్రజావాణిలో రైతులు ఫిర్యాదు చేయడం జరిగింది. రాంనగర్, సీటూ క్వార్టర్స్, పాత లద్నాపూర్ ఫ్లాట్స్, కొత్త ఫ్లాట్స్, డ్రైనేజ్ వాటర్ ను రత్నాపూర్ ప్రభుత్వ స్కూల్ వద్దకు వదిలే విధంగా డ్రైనేజీ నిర్మాణానికి సింగరేణి సంస్థ టెండర్ పనులు పిలవడం జరిగింది.దీంతో పై నుండి వచ్చే డ్రైనేజీ వాటర్ తో కింద ఉన్న పంట పొలాలకు ముప్పు వాటిల్లుతుందని ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో మంగళవారం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద డ్రైనేజీ వాటర్ ను ఎంపీడీవో బద్రి శైలజ రాణి తో పాటు గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ–పివి రావు, గ్రామ కార్యదర్శి సంతోష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజ రాణి మాట్లాడుతూ పై నుండి వచ్చే సైడ్ డ్రైనేజ్ వాటర్ తో పంట పొలాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పంటపొలాలకు నష్టం వాటిల్లకుండా కొంత మేరకు ఎంతసే పట్టా భూమి సేకరించి పూర్తిస్థాయిలో సింగరేణి సంస్థతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శైలజ రాణి అన్నారు.

## వెయ్యి డాలర్లు అందజేసిన సుందరం ఫౌండేషన్ అధ్యక్షుడు బోనాల



రామగిరి,మే 12(ది క్రైమ్ న్యూస్):– కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ కు చెందిన మాజీ ఎంపీటీసీ సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి వెయ్యి డాలర్ల ను లైన్స్ క్లబ్ గవర్నర్ కోదండరాం కు మంగళవారం అందజేశారు. హనుమాన్ జయంతి పురస్కరించుకొని లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు బోనాల వెంకటస్వామి వెయ్యి డాలర్లు అనగా సుమారు లక్ష రూపాయలను అందజేయడం జరిగింది. సుందరం ఫౌండేషన్ ద్వారా కమాన్ పూర్ మండలంలో ఇప్పటివరకు విద్యా వైద్య సహాయంతో పాటు పలు సేవా కార్యక్రమలు బీదలకు బియ్యం అందజేయడం, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం చేశారు. సమాజ సేవ చేయడమే ఉత్తమ ప్రథమ కర్తవ్యం అని సమాజ సేవ చేయడంలో ఆనందం ఉందని బోనాల వెంకటస్వామి పేర్కొన్నారు. వెయ్యి డాలర్లు అందజేసిన బోనాల వెంకటస్వామిని కమాన్ పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సాన రామకృష్ణారెడ్డి, నల్లవెల్లి శంకర్, లయన్ జబ్బార్ ఖాన్ పలువురు కొనియాడారు.

## మొక్కజొన్న నిల్వకు అదనంగా 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం సిద్ధం

**నేటి నుంచే కొనుగోలు కేంద్రాల నుంచి మొక్కజొన్న తరలింపు చేపట్టాలి**

**తగినంత హమాలీలను ఏర్పాటు చేసి నిల్వ ప్రక్రియ వేగవంతం చేయాలి**

**రంగాపూర్ ఐజి గోదాంలో మొక్కజొన్న నిల్వ ఏర్పాట్లపై ప్రత్యేక పర్యవేక్షణ**

### అప్పన్నపేట ఎస్.ఆర్.ఆర్ రైస్ మిల్, కన్నాల గణపతి ఇండస్ట్రీస్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గల ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌లో గల ధాన్యం గోదాములను పరిశీలించారు. అనంతరం అప్పన్నపేటలోని ఎస్.ఆర్.ఆర్ రైస్ మిల్‌ను తనిఖీ చేశారు. అలాగే పాలకుర్తి మండలంలోని కన్నాలలో గల గణపతి ఇండస్ట్రీస్‌ను పరిశీలించి మొక్కజొన్న నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నేటి నుంచి పెద్దపల్లి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, పాలకుర్తి తహసీల్దార్ సునీత, డీటీసీఎస్ మహేష్, రవీందర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## సేవతోనే నర్సులకు గుర్తింపు

### ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ శ్రీలక్ష్మి

### మెడికవర్ ఆసుపత్రిలో ఘనంగా నర్సింగ్ డే వేడుకలు



కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్) : నర్సులు తమ వృత్తిని ఉద్యోగంగా కాకుండా సేవగా భావించినప్పుడే గుర్తింపు వస్తుందని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. వరల్డ్ నర్సింగ్ డే సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి అనంతరం కేక్ కట్‌చేసి మాట్లాడారు. ఆరోగ్య వ్యవస్థలో నర్సుల పాత్ర అత్యంత కీలకమైందని చెప్పారు. రోగుల సేవలో నర్సులు చూపే అంకితభావం, సహనం, మానవత్వం హాస్పిటల్‌కు మంచి పేరు తీసుకొస్తాయని పేర్కొన్నారు. వైద్యులు చికిత్స అందిస్తే, ఆ చికిత్సను రోగికి సమర్థవంతంగా అందించే బాధ్యత నర్సులదేనని తెలిపారు. ప్రతి రోగిని కుటుంబ సభ్యుడిగా భావించి సేవలు అందించినప్పుడే నర్సింగ్ వృత్తికి మరింత గౌరవం పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. వేడుకల సందర్భంగా నర్సుల సేవలను కొనియాడుతూ పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు. నర్సులు ఆరోగ్య రంగానికి వెన్నెముకలుగా నిలుస్తూ రోగులు కోలుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. చివరగా నర్సింగ్ సిబ్బందికి సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినయ్, డాక్టర్ అనీష్, డాక్టర్ లోకేష్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నయన, డాక్టర్ తాహా, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, సీఎస్‌వో గౌస్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మానకొండూర్, మే12(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలవ్యాప్తంగా మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి దేవాలయాలను ప్రత్యేకంగా రంగురంగు పూలు, పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించగా ఉదయం నుండే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారినీ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అర్చకుల హోమాలతో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం భజనలు,దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు,ఆలయ అర్చకులు, ఆంజనేయ మాలా దారులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఖర్చులు తగ్గింపు... మోడీ నుంచే మొదలవ్వాలి !

మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700-900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం  పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

# కలిసొచ్చిన కాలం.. వికసించిన కమలం



పశ్చిమ బెంగాల్‌లో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ పతనం అనేది కేవలం ఒక ప్రాంతీయ పార్టీ ఓటమి లేదా మరో జాతీయ పార్టీ విజయం మాత్రమే కాదు. ఇది బెంగాల్ రాజకీయ సంస్కృతిలో చాలా కాలంగా జరుగుతున్న లోతైన మార్పుకు ముగింపు ఘట్టంగా భావించవచ్చు. ఒకప్పుడు వర్గ చైతన్యంపై ఆధారపడిన సిద్ధాంతపరమైన సామూహిక రాజకీయాలు నడిచిన బెంగాల్‌లో, ఇప్పుడు వ్యక్తి ఆధారిత, ధ్రువీకరణకు లోనైన రాజకీయ పోటీ పెరిగింది. ఈ మార్పులో గుర్తింపు రాజకీయాలు, సంస్థాగత శక్తి, అధికార కేంద్రీకరణ వంటి అంశాలు కీలక పాత్ర పోషించాయి. బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ ఎదుగుదల కేవలం ఎన్నికల ఫలితంగా మాత్రమే చూడలేం. ఒకప్పుడు బలంగా ఉన్న వామపక్ష రాజకీయ సంస్కృతి ఎలా క్రమంగా బలహీనపడింది, లోపలినుంచి ఖాళీ అయింది, చివరకు దాని స్థానాన్ని కఠిన జాతీయవాద రాజకీయాలు ఎలా ఆక్రమించాయన్న దానికి ఇది ఉదాహరణగా నిలిచింది. దశాబ్దాల పాటు దేశంలోని ఇతర రాష్ట్రాలకు పశ్చిమ బెంగాల్ భిన్నంగా నిలిచింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) నేతృత్వంలోని వామపక్ష కూటమి పాలనలో బెంగాల్ ట్రేడ్ యూనియన్ రాజకీయాలు, లౌకికవాదం, మేధో చర్చలు, రైతాంగ ఉద్యమాలు, మతపరమైన రాజకీయాలపై అనుమాన దృక్పథానికి ప్రతీకగా నిలిచింది. 'భద్రలోక్' సంస్కృతిపై ఎలిటిజం ఆరోపణలు ఉన్నప్పటికీ, సాహిత్యం, నాటకం, రాజకీయ చర్చలు, సిద్ధాంతపరమైన వాదోపవాదాలు ప్రజా జీవితంలో ముఖ్యస్థానం పొందిన ఉదారవాద సాంస్కృతిక సంప్రదాయానికి అది ప్రతినిధిగా భావించబడింది. అయితే చరిత్రలో మార్పులు ఒక్కరోజులో రావు. వామపక్షాల బలహీనత 2011 ఎన్నికల ఓటమి కంటే చాలా ముందే ప్రారంభమైంది. రాష్ట్రంలో పారిశ్రామిక స్తబ్దత, అధికార యంత్రాంగ కఠినత్వం, పార్టీ వ్యవస్థలో పెరిగిన అహంకారం, యువత ఆశయాల నుంచి పార్టీ క్రమంగా దూరమవడం వంటి అంశాలు వామపక్ష కూటమి నైతిక ఆధారాలను దెబ్బతీశాయి. సింగూర్, నందిగ్రామ్ భూసేకరణ వివాదాలు ఈ పరిణామంలో కీలక మలుపుగా మారాయి. ఈ సమయంలో మమతా బెనర్జీ రైతులు, అణగారిన వర్గాల పరిరక్షకురాలిగా తనను ప్రజల ముందుంచడంలో విజయవంతమయ్యారు. మరోవైపు వామపక్ష ప్రభుత్వాన్ని అధికార కేంద్రీకృత, ప్రజల నుంచి దూరమైన వ్యవస్థగా చిత్రీకరించగలిగారు. వామపక్షాలపై పోరాట సమయంలో మమతా బెనర్జీ అనుసరించిన అనేక రాజకీయ పద్ధతులే తరువాత ఆమె పాలనలో విమర్శలకు కారణమవడం రాజకీయాల్లోని పెద్ద విరోధాభాసంగా మారింది. వీధి హింస, తీవ్రమైన ప్రజాకర్షక రాజకీయాలు, వ్యక్తి పూజ ఆధారిత రాజకీయ సంస్కృతి, భావోద్వేగాల ఆధారంగా ప్రజలను సమీకరించడం, సంస్థల విశ్వసనీయతను క్రమంగా దెబ్బతీయడం వంటి అంశాలు అప్పటి రాజకీయ పోరాటంలో ప్రధాన ఆయుధాలుగా మారాయి. తృణమూల్ కాంగ్రెస్ వామపక్షాలను కేవలం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒప్పించి ఓడించలేదు. నిరంతర సంస్థాగత పోరాటం ద్వారా వారి బలాన్ని క్రమంగా కూల్చివేసింది. అనేక గ్రామీణ ప్రాంతా ల్లో వామపక్ష కార్యకర్తలు భౌతిక దాడులకు గురయ్యారు. కొన్ని జిల్లాల్లో సిద్ధాంతపరమైన చర్చల స్థానంలో భయ రాజకీయాలు చోటుచేసుకున్నాయి. ఈ లక్ష్య సాధనలో అనేక రకాల వ్యూహాలు అమలులోకి వచ్చాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు బెంగాల్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాయి. తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలహీనపరచేందుకు ఎంపిక చేసిన దర్యాప్తులు, లక్ష్యంగా చేసుకున్న దాడులు, ఒత్తిడి రాజకీయాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష నేతలు పదేపదే ఆరోపించారు. ఇదే సమయంలో ఎన్నికల నిర్వహణ, భద్రతా బలగాల మోహరింపు, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియల్లో ఎన్నికల సంఘం పాత్ర కూడా తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రత్యేకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలు మైనారిటీలు, వలస జనాభాపై అధిక ప్రభావం చూపుతున్నాయని విమర్శకులు పేర్కొన్నారు. దీనివల్ల తమ ఓటు హక్కు కోల్పోతామన్న భయాలు ఆ వర్గాల్లో పెరిగాయి. ప్రస్తుతం బెంగాల్ రాజకీయ చర్చల స్వరూపం 1980లు, 1990ల కాలంతో పోలిస్తే పూర్తిగా మారిపోయింది. కార్మిక హక్కులు, వ్యవసాయ సంస్కరణలు, సామ్యవాద మార్పు వంటి అంశాలపై ఆధారపడిన రాజకీయ చర్చలు ప్రధాన ఎన్నికల రాజకీయాల నుంచి దాదాపు కనుమరు గయ్యాయి. వాటి స్థానంలో మతం, జాతీయవాదం, ప్రతీకాత్మక రాజకీయాలు, నాయకుల వ్యక్తిగత ఆధారిత రాజకీయాలు ముందుకు వచ్చాయి. లెనిన్ విగ్రహ ధ్వంసం బెంగాల్ వామపక్ష మేధో, రాజకీయ వారసత్వాన్ని క్రమంగా కూల్చివేయాలనే ప్రక్రియకు సంకేతంగా మారింది. బెంగాల్ సాంస్కృతిక మార్పు ఇప్పటికే ప్రారంభమైందన్న హెచ్చరికగా కూడా అది కనిపించింది. ఇప్పుడు బిజెపికి స్పష్టమైన శాసనసభ మెజారిటీ లభించిన నేపథ్యంలో ప్రభుత్వ అస్థిరతకు అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వాలపై ఆధారపడే పరిస్థితి కాకుండా, బలమైన కాషాయ ప్రభుత్వం దీర్ఘకాలిక సిద్ధాంతపరమైన ధైర్యంతో అధికారాన్ని వినియోగించే అవకాశముంది. దేశవ్యాప్తంగా గత అనుభవాలను పరిశీలిస్తే, బిజెపి ఒకసారి స్థిరమైన అధికారాన్ని సాధించిన తర్వాత కేవలం ఎన్నికల పరిపాలనకే పరిమితం కాకుండా, సాంస్కృతిక పునర్నిర్మాణం వైపు కూడా అడుగులు వేయడానికి ప్రయత్నిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రవీంద్రనాథ్ ఠాగూర్, కాజీ నజ్రుల్ ఇస్లాం, సత్యజిత్ రే వంటి మహనీయుల బెంగాల్ హిందూ- ముస్లిం సహజీవనం, మేధో వైవిధ్యం, విప్లవాత్మక రాజకీయ ఆలోచనల సమ్మిళిత సంప్రదాయంతో రూపుదిద్దుకుంది. అయితే విమర్శకులు మరింత లోతైన ప్రమాదాన్ని సూచిస్తున్నారు. బెంగాల్ బహుళ సాంస్కృతిక గుర్తింపు క్రమంగా దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. తీవ్ర మత ధ్రువీకరణ రాష్ట్ర సామాజిక నిర్మాణాన్ని శాశ్వతంగా మార్చివేసే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే రాజకీయ చర్చల భాష మరింత కఠినంగా, అసహనపూర్వకంగా, విభజనాత్మకంగా మారిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక సంస్థలు, మీడియా వేదికలు కూడా క్రమంగా సిద్ధాంతపరమైన ఒత్తిళ్లకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ చారిత్రక కూడలిలో నిలిచింది. మమతా బెనర్జీ పతనం కేవలం ఒక ప్రభుత్వానికి ముగింపు మాత్రమే కాదు. వామపక్షాల క్షీణతతో ప్రారంభమైన మొత్తం రాజకీయయుగానికి ముగింపు సంకేతంగా కూడా దీనిని చూడవచ్చు. కొత్త సిద్ధాంతపరమైన రాజకీయ వ్యవస్థలోకి అడుగుపెడుతున్న ఈ సమయంలో బెంగాల్ తన ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోగలదా లేదా అన్నది ఇప్పటికీ అనిశ్చితంగానే ఉంది. భవిష్యత్తులో ఏమి జరగబోతుందో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు తాను దేశ రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో ప్రత్యేకమైన మినహాయింపుగా భావించుకున్న బెంగాల్ ఇప్పుడు ఆ స్థితిలో లేదు. ఎర్రకోట క్రమంగా వెలిసిపోయింది. కాషాయ తరంగం అక్కడికి చేరుకుంది. భద్రలోక్ సంస్కృతికి నిలయంగా పేరొందిన బెంగాల్ భవిష్యత్తు ఇప్పుడు జ్ఞాపకాలకూ, మార్పులకూ మధ్య నిలిచిపోయింది

## నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

### ఆందోళనలో స్థానిక ప్రజలు

వరంగల్,మే12 : జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

### డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక

చెన్నై : తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు.

## మోడీ ఉపయోగించే విమానం అమ్మేయాలి

### అప్పడే ఖర్చులు తగ్గించుకోవడం సాధ్యం


### స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన వ్యాఖ్యలు

లక్నో : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కొన్ని పొదుపు సూచనలు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పర్యటన సమయంలోఆయన బహిరంగ సభలో పాల్గొని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు ఆపాలన్నారు. డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడాలని సూచించారు. రాబోయే కరువు, దారిద్ర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ఆ సూచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రధాని పొదుపు సూచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దుబారా ఖర్చులు చేయవద్దు అంటే ముందుగా ప్రధాని వినియోగించే సుమారు 8 వేల కోట్ల ఖరీదైన ఎయిర్ ఇండియా వన్ విమానాన్ని అమ్మేయాలని స్వామి అవిముక్తేశ్వరానంద అన్నారు. ఖర్చులు తగ్గించు కోవాలని ప్రజలకు చెప్పడం కాదు, ముందుగా ఆ విమానాన్ని అమ్మేసేయాలని ఆయన అన్నారు. యూపీలోని సోన్‌భద్రతలో జరిగిన గోవిష్ట్ యాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పొదుపు అనేది అధికారంలో ఉన్న వ్యక్తుల నుంచే మొదలు కావాలని ఆయన అన్నారు. ధర్మం అనేది ఇంటి నుంచే మొదలు కావాలని అవిముక్తేశ్వరానంద అభిప్రాయపడ్డారు.

## చివురించిన చేతికర్ర

### క్రీస్తు సందేశం

పూర్వకాలంలో దేవుడు ప్రజలతో మాట్లాడేవాడట. అలా మాట్లాడేది కేవలం తన స్వరంతోనే గాక, చేష్టలతో కూడా! ఆయా సంఘటనల్లో తనవైన నిర్ణయాలను, ఆదేశాలను తెలియజేసేవాడట. అలాగే బైబిల్ పూర్వ నిబంధనలో ఆరోను పెద్దరికాన్నీ, అర్చకాధిపత్యాన్నీ నిర్ణయించడానికి ఓ సంఘటన జరిగింది. అదే 'బాగా ఏండిపోయిన చేతికర్ర మళ్లీ చిగురించడం'. దానిని దైవ నిర్ణయంగా భావించి అక్కడివారంతా ఆ చేతికర్ర గలవాణ్ని పూజాధికారిగా అంగీకరించడం విశేషం. క్రీస్తుకు ముందు 1500 సంవత్సరాల కిందట జరిగిన కథ ఇది. ఆరోను ఎవరో కాదు, ప్రజల్ని ఈజిప్టు చెరలోంచి బంధ విముక్తుల్ని చేసి విడిపించి తెచ్చిన మహానాయకుడు మోషే సోదరుడు. అతనికి ఒక అక్క కూడా ఉంది. ఆమె పేరు మిరియాం. ఆరోను ఇశ్రాయేలీయ పన్నెండు గోత్రాల్లో ఒక గోత్రానికి పెద్ద. ప్రజలను ఆధ్యాత్మికంగా నడిపించడంలో మోషేకు సహకరించిన వ్యక్తి. ఆరోనుకు మరో పేరు అహరోను. కాంతిదాయకుడు అని, కొండంత బలవంతుడు అని ఆ పేరుకు అర్థం. ఆరోను పూజారి నియమాలకు సంబంధించిన వాడు, నిష్ఠాగరిష్ఠుడు. అయితే తన పూజారి పదవిని నిర్ధారించేది దేవుడే! ప్రజల్లో అప్పటికే ఈ అన్నదమ్ముల (మోషే, ఆరోను) నాయకత్వంపై గొణుగుడు ప్రారంభమైంది. ఇద్దరి మధ్యా పోటీ చాపకింద నీరులా ప్రవహించింది. ఆ నేపథ్యంలో పన్నెండు గోత్రాల వారూ తమ తమ చేతికర్రలు మందిరంలో ఉంచాలి. దేవుడు ఏ గోత్రపు నాయకత్వాన్ని ఆశీర్వదిస్తాడో ఆ వ్యక్తి చేతికర్ర చిగురులెత్తి పుష్పించాలి. అలా చిగురించిన చేతికర్ర గలవాడిని అందరూ పూజాధికారిగా అంగీకరిస్తారు. దేవుడి ఆశీర్వాదంతో ఆరోను చేతికర్ర చివురించింది, పుష్పించింది, ఫలించింది కూడా! మహోత్సవంతో ప్రజలంతా ఆరోనును దైవార్చకుడిగా గౌరవించారు.



ఆధ్యాత్మికం

# కార్మికులను పెట్టుబడి దారులకు బానిసలుగా చేసే నిర్ణయాన్నీ మానుకోవాలి

## -నాలుగు లేబర్ కోడ్స్ గెజిట్ పత్రాలను దగ్ధం చేసిన సీఐటీయూ నాయకులు

రామగిరి, మే 12(ది క్రైమ్ న్యూస్):- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలు గెజిట్ పత్రాలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్.జీ-త్రీ లోని అన్ని మైన్స్ లలో దగ్ధం చేయడం జరిగిందని సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య, అన్నారు. ఈ సందర్భంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 8న విడుదల చేయడం జరిగింది.కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా గెజిట్ పత్రాలను దగ్ధం చేయడం జరుగుతుంది.కార్మికులను పెట్టుబడి దారులకు బానిస లుగా చేసే నిర్ణయాన్నీ మానుకోవాలని, పోరాటాలు, త్యాగాలతో సాధించుకొని అనుభవిస్తున్న చట్టాలను రద్దు చేయడం అన్యాయమని దీనిని ఎదుర్కోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య పిలుపు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య,






ఎమ్.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాస్, తిరుపతి,సతీష్,ఇందూరి శ్రీనివాస్,డి. రవికుమార్, ఎమ్ .సదానందం,వెంకటేష్, యూ .రాజబాబు, కామేశ్వర రావు డి . మల్లయ్య,రాజేష్,పి .సతీష్, రవి, రాజలింగు, జె.వెంకటేష్,సాయి ప్రమోద్,నరసయ్య, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం అంబలి అందజేయడం అభినందనీయం.

## - అంబలిని అందజేస్తున్న ఛత్రపతి శివాజీ సభ్యులు



రామగిరి,మే 12(ది క్రైమ్ న్యూస్) : కమాన్ పూర్ మండల కేంద్రంలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిత్యం అంబలి అందజేయడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇనగంటి రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నిత్య అంబలి కేంద్రంలో అంబలిని రామారావు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నిత్యం అంబలి అందజేయడం వల్ల బ్యాంకుకు, ఇతరత్రా పనులకు వచ్చే వారికి ఎంతో ఆకలి తీరుస్తుందని అన్నారు. ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలను యువత చేయాలని అటువంటి వారికి తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు జంగిపల్లి శ్రీనివాస్, రెబల్ రాజ్ కుమార్, మెరుగు కుమార్, పచ్చునూరి రాజు, మేడగొని విజయ్, జంగేపల్లి రవి, మల్యాల మహేష్, బోసికి వరప్రసాద్ జగ్గయ్యపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో 'వి2 వాల్యూ,వెరైటీ' షోరూం ఘనంగా ప్రారంభం



కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్) : నగరంలోని వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటులోకి తెస్తూ 'వి2 వాల్యూ, వెరైటీ నూతన షోరూంను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 65వ డివిజన్ కార్పొరేటర్ మోసిన్ మోహిద్దీన్ హాజరై, రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలకు అత్యాధునిక ఫ్యాషన్ డిజైన్లను, నాణ్యమైన దుస్తులను ఒకే చోట అందించడం అభినందనీయమని అన్నారు.బిర్బాహౌసర్ ప్రసాద్, రవిశంకర్ తివారి మాట్లాడుతూ తమ షోరూంలో అన్ని వర్గాల ప్రజలకు సరిపోయేలా లేటెస్ట్ వెరైటీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే అతి తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, షోరూం సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



ఖమ్మం ప్రతినిధి , (ది క్రైమ్ న్యూస్) : ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం టూ వరంగల్ హైవే రోడ్డులో మేకల తండా స్టేజి సమీపంలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక లారీలో బొగ్గు లోడ్ ఉండగా, మరో లారీలో ఆలుగడ్డలు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం తీవ్రతకు రెండు లారీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీలో భారీ మంటలు చెలరేగడంతో ప్రాంతమంతా పొగతో కమ్ముకుంది. మంటలు ఎగసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేపట్టారు. ఘటన కారణంగా హైవేపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇంకా వివరాలు తెలియాల్సి ఉన్నది.

# వేసవి జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేపట్టాలి


## -ఎంపీడీవో బద్రి శైలజ రాణి



రామగిరి, మే 12(ది క్రైమ్ న్యూస్) : రామగిరి మండలంలోని రామగిరి ఖిల్లా ప్రాంతంలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను మంగళవారం ఎంపీడీవో బద్రి శైలజ రాణి,రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ -పీవీరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కార్మికుల హాజరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పనులు నిర్వహించాలని ఆమె సూచించారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రంగా ఉండటంతో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.పనుల నాణ్యతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. కూలీల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పనిస్థలంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు.అనంతరం అక్కడి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాది ఏపీఎం వి.మౌనిక, టీ.ఏ ఎం.అఖిల, ఫీల్డ్ అస్సిటెంట్ ఎస్.జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి ఇలాకాలో కాలువ భూమి కబ్జా

## - ఏదులాపూరం 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ డివిఎన్ శరత్ కుమార్



ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) : ఖమ్మం రూరల్ మండలంలోని ఎన్.ఎస్.పి లింక్ కెనాల్ ఆక్రమణల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే ఇలాంటి ఆక్రమణలు కొనసాగడం ఆశ్చర్యకరమని ఏదులాపూరం మున్సిపాలిటీ 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ డి వి ఎన్ శరత్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏదులాపూరం మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్.ఎస్.పి లింక్ కెనాల్ పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయని తెలిపారు. కాలువ భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి



అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. కాలువ ఆక్రమణల కారణంగా వర్షాకాలంలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఎన్.ఎస్.పి ప్రధాన కాలువ నుంచి పల్లెగూడెం, రెడ్డిపల్లి, పోలేపల్లి, సాయి గణేష్ నగర్, షిరిడి సాయి నగర్, కరుణగిరి ప్రాంతాల మీదుగా మున్నేరు వాగులోకి ప్రవహించే లింక్ కెనాల్ బఫర్ జోన్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాల కారణంగా కాలువ సహజ వెడల్పు తగ్గిపోవడంతో పాటు ప్రవాహ మార్గం కూడా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారని చెప్పారు. ఫలితంగా వర్షాకాలంలో వరదనీటి సహజ ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడి రోడ్లపై నీరు నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో వరదనీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి పెరిగి అంటువ్యాధుల ప్రమాదం నెలకొంటోందని, దుర్గంధం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లు మరియు ఇతర ప్రజా మౌలిక సదుపాయాలు కూడా దెబ్బతింటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ఎదులాపురం మున్సిపల్ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందజేసినట్లు తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి కాలువ అసలు పరిమాణాలు, బఫర్ జోన్ వివరాలు నిర్ధారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. అక్రమ నిర్మాణాల పై సమాచార హక్కు చట్టం - 2005 ప్రకారం ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్‌కు ఆర్‌టీఐ దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. కాలువ అసలు రికార్డులు, బఫర్ జోన్ వివరాలు, గత సర్వే నివేదికలు, అక్రమ నిర్మాణాల పై తీసుకున్న చర్యలు మరియు భవిష్యత్ పరిరక్షణ చర్యల పై పూర్తి సమాచారం కోరినట్లు వెల్లడించారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం మరియు ప్రభుత్వ ఆస్తుల రక్షణ దృష్ట్యా సంబంధిత శాఖలు వెంటనే స్పందించి అక్రమల పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారని తెలిపారు.

# హిందూ ఏక్తా యాత్ర సక్సెస్ చేయాలని కరపత్రాల పంపిణీ



కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్) : కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం చేపడుతున్న హిందూ ఏక్తా యాత్ర ను విజయవంతం చేయాలని కోరుతూ కరీంనగర్ పశ్చిమ జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ పశ్చిమ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి ,పశ్చిమ జోన్ ఇంచార్జ్ అడిచర్ల రాజు, బిజెపి జిల్లా సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం హనుమాన్ జయంతి పురస్కరించుకొని కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ మంగళవారం రోజున నిర్వహిస్తున్న హిందూ ఏక్తయాత్రకు హిందూ బంధువులందరూ తరలిరావాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో పశ్చిమ జోన్ ఉపాధ్యక్షులు దయ్యాల మల్లేశం ,అప్పల శ్రీనివాస్, బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు ఉదారపు విద్యాసాగర్, కాసం సంతోష్ రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



కరీంనగర్ టౌన్, మే12(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు తిరునగరి వెంకటాద్రి స్వామి, హర్షవర్ధన్ స్వామి ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. హనుమాన్ జన్మ దినోత్సవము సందర్భంగా ఆలయానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య , గడప శేఖర్ , సిరిపురం శ్రీనివాస్ , సల్ల మల్లేశం , బూట్లకరుణాకర్,రాజేంద్రప్రసాద్ , రాజిరెడ్డి , సుధాకర్ రెడ్డి, మృత్యుంజయం , కొట్టాల శ్రీనివాస్ , చిందం అంజి , చిందం మహేష్ లతోపాటు కాలనీ ప్రజలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# స్వామి వివేక్‌పటేల్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆకుల స్వామి వివేక్ పటేల్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పి చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్‌పటేల్ ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన స్వామికి ధైర్యం చెప్పి, బాధితుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మాజీ కౌన్సిలర్లు పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తదితరులున్నారు.

# జమాయిల్ పుల్ల ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఖమ్మం ప్రతినిధి , (ది క్రైమ్ న్యూస్ ): బూర్గంపాడు మండలం సారపాక ఐటిసి వెస్ట్ గేట్ కి యూ టర్న్ తీసుకుంటున్న జమాయిల్ పుల్ల ట్రాక్టర్ ను ఢీకొన్న కారు. జామాయిల్ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ సడన్ బ్రేకు వేయడంతో వెనుక నుంచి ఢీ కొట్టిన కారు నలుగురికి తీవ్ర గాయాలు ఒకరి పరిస్థితి విషమంగా ఉన్న శివకుమార్ రెడ్డి ను హుటాహుటిన భద్రాచలం ప్రభుత్వ హాస్పటల్ కు తరలింపు. ఏరియా హాస్పిటల్ నుండి అత్యవసర చికిత్స కై శివ కుమార్ రెడ్డి అనే వ్యక్తిని హైదరాబాద్ కు తరలింపు. యాక్సిడెంట్ కు కారణమైన జమాల్ పుల్ల ట్రాక్టర్ ను స్టేషనుకు తరలించారా లేదా? పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ప్రశ్నాపత్రాల లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

## తొర్తి అరవింద్



తిమ్మాపూర్, మే12(ది క్రైమ్ న్యూస్): జాతీయ అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించిన ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమని ఆగ్రహం వ్యక్తంచేస్తూ యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తొర్తి అరవింద్ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.దేశవ్యాప్తంగా సుమారు 22లక్షల మంది పరిక్షకు హాజరైతే, తెలంగాణ నుండే 71 వేల మంది విద్యార్థులు భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని, పరీక్షలో జరిగిన అవకతవకలతో విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని పేర్కొన్నారు.రాజస్థాన్ లో అధికారంలో ఉన్న కేంద్ర బీజేపీ వైఫల్యం వల్లే పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను నిర్వహించడంలో బిజేపి పూర్తిగా విఫలమైందని, దేశ విద్యా వ్యవస్థ పరువును దిగజార్చేలా ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. సంక్షోభానికి పూర్తి బాధ్యత వహించి ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షలు రాసిన విద్యార్థులు,వాళ్ళ తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని కోరుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తొర్తి అరవింద్ ప్రకటన ద్వారా భరోసానిచ్చారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత జగదీష్ గౌడ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : హనుమాన్ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మాతృశ్రీ నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, ఇజ్జత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ హనుమాన్ దేవాలయాల్లో మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రీ హనుమంతుడు ప్రజలందరికీ బలం, ధైర్యం, విజయాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. శ్రీ హనుమంతుడు భగవంతునిపై అచంచలమైన భక్తి ఎలా ఉండాలో ప్రపంచానికి చూపించారని అన్నారు. శ్రీరాముడి సేవనే జీవిత లక్ష్యంగా భావించి నిస్వార్థంగా పనిచేసినందుకే ఆయనను "భక్త శిరోమణి"గా పిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సయ్యద్ గౌస్, ఏకే బాలరాజ్, సాంబశివరావు, జంగయ్య యాదవ్, గంగల శ్రీనివాస్ యాదవ్, గంగల గణేష్ యాదవ్, వెంకటేష్ సాగర్, మహేష్, వెంకట్ రెడ్డి, ముక్తార్, ఇస్మాయిల్, లతీఫ్, శశిరేఖ, శ్రీజ రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిజిలి యోజన పథకాన్ని వినియోగించుకోండి: ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్, మే12(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం పచ్చునూరులో రాష్ట్ర పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ అధికారులు మంగళవారం సోలార్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా తమ ఇంటి డాబాలపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చున్నారు. ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా మిగులు విద్యుత్ ను గ్రిడ్‌కు ఇచ్చి అదనపు ఆదాయాన్ని పొందుతూ పథకాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.అనంతరం వీవో భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.టీఎస్ రెడ్ కో అధికారులు, ఎంపీడీవో వరలక్ష్మి,ఎంపీఓ సత్తీష్ రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, నాయకులు రొంటల లక్ష్మారెడ్డి, కనకం అశోక్, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, సాయిరి దేవయ్య,బుర్ర శ్రీధర్ గౌడ్,తోట తిరుపతి తదితరులు ఎమ్మెల్యే వెంట కార్యక్రమాల్లో పాల్గొన్నారు.






# బైక్ ర్యాలీ ప్రారంభించిన బీజేపీ నేత రవికుమార్ యాదవ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : హనుమాన్ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ తెలంగాణ రాష్ట్రం, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం మసీద్‌బండ గ్రామం, శ్రీరామ్ నగర్ కాలనీలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామ్ నగర్ కాలనీ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని రవికుమార్ యాదవ్ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. యువత ధర్మ పరిరక్షణతో పాటు సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, భక్తి, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించిన హనుమాన్ యూత్ సభ్యులను అభినందిస్తూ, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి అనుగ్రహంతో ప్రజల సంకల్పాలన్నీ నెరవేరాలని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, అనంత రెడ్డి, ఎల్లా రెడ్డి, విజయ్ కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీలలో రూ.1 కోటి 24 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ మంగళవారం సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ తో కలియ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కాలనీ వాసుల సౌకర్యార్థం చేపడుతున్న సీసీ రోడ్లు, వరద నీటి కాల్వ పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో రూ.1650 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. సీఎం మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హఫీజ్‌పేట్ మంజీరా రోడ్డు నుంచి మసీద్‌బండకు వెళ్లే లింక్ రోడ్డులోని రైల్వే అండర్‌పాస్ వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉందని, దీనికి శాశ్వత పరిష్కారం కోసం వరద నీటి కాల్వ నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలను పూర్తిగా నివారించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన గాంధీ, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పనిచేస్తోందన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రాంగూడ, దర్గా వెస్టన్ ప్లాజా కాలనీలలో రూ.2 కోట్ల 4 లక్షల వ్యయంతో చేపట్టనున్న స్మశానవాటిక అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నానక్‌రాంగూడ, దర్గా వెస్టన్ ప్లాజా కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నానక్‌రాంగూడ స్మశానవాటికను అన్ని హంగులతో, సకల సదుపాయాలతో అభివృద్ధి చేసి "మహాప్రస్థానం" తరహాలో సుందరవనంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అంత్యక్రియలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. పనులు నాణ్యత ప్రమాణాలతో, ఎలాంటి రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికులు ఆందోళన చెందవద్దు

**- సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కట్టుబడి ఉంది**

**- అర్జీ-త్రీ ఏపీఏ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి**

రామగిరి, మే 12(ది క్రైమ్ న్యూస్):- సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తోందని అర్జీ-త్రీ ఏపీఏ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి తెలిపారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి లను అలాగే సింగరేణి సంస్థ సీ ఎండి ని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆందోళనలు, సమస్యలు, సంస్థ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సుదీర్ఘంగా వివరించినట్లు చెప్పారు.దీనికి స్పందించిన రాష్ట్ర మంత్రులు, సీఎం సలహాదారులు సీ ఎండి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మెడికల్ బోర్డు వ్యవహారంలో జరిగిన అవకతవకలను ప్రస్తావిస్తూ, అన్ఫిట్ పేరుతో కార్మికుల నుండి లక్షల రూపాయలు వసూలు చేసిన పరిస్థితులు పునరావృతం కాకుండా నిజాయితీగా వ్యవస్థ కొనసాగించాలని కోరినట్లు చెప్పారు.అదేవిధంగా పెరెక్స్‌పై ఐటీని సింగరేణి సంస్థ నుండే చెల్లించడం, సోశీతింటికల సమస్యల పరిష్కారం, కొత్త గనులు ప్రారంభించకపోవడం వల్ల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోతున్న నేపథ్యంలో వెంటనే కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.కాంట్రాక్ట్ కార్మికులకు వేజెస్ అమలు చేయాలని జనక్ ప్రసాద్ కోరగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ఆధ్వర్యంలో చర్చలు కొనసాగినట్లు వెల్లడించారు.సింగరేణి సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లతో రాష్ట్ర మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే సమావేశం జరిగి సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని, కార్మికులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోట రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు వుయ్యాల కుమారస్వామి, జిఎం కమిటీ సభ్యులు ఎల్లంకి రావు, పిట్ కార్యదర్శులు రామిడ్ల మనోహర్, కె ఎన్ చారి, ఎనగందుల సదానందం, రెసిడెంటల్ కమిటీ సభ్యులు బుద్దే సదానందం, సోషల్ మీడియా ఇంచార్జి మేకల మారుతి యాదవ్,నాయకులు అర్జున్,ఇంద్రసేన రెడ్డి,సతీష్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం ఇస్తానని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి




రామగిరి , మే 12(ది క్రైమ్ న్యూస్):- ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మంథని ఎస్ఐ రమేష్ కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు . మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంథని మండలం అడవిసోమన్ పల్లి గ్రామానికి చెందిన బండి రాజు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు పెట్టిస్తానని బాధితుల వద్ద నుండి 2019లోనే విడివిడిగా ఒక్కొక్కరి దగ్గర నుండి రూ.రెండు లక్షల చొప్పున సుమారు పది మంది వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశారని బాధితులు వాపోయారు. డబ్బులు ఇవ్వమని అడిగితే, ఇవ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తమ పట్ల న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో బాధితులు అనపర్తి రాజబాబు, అనపర్తి స్వప్న, పాగే అరవింద్, పాగే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గోడపత్రిక ఆవిష్కరించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : జూన్ 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రపంచ తెలుగు సాహితీ మహాసభల జాతీయ సమన్వయకర్తలు, స్థానిక కవులు, తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు మోటూరి నారాయణరావు, శేరిలింగంపల్లి రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు అరవా, ఉపాధ్యక్షులు జె.వి. కుమార్ చేపూరి, ప్రముఖ కవి, రచయిత, దర్శకులు గూండ్ల నారాయణ తదితరులు పీఏసీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో కలిసి సత్కరించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ వెలుగులు

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఆనందం**

**-కల్వచర్ల లో ఇందిరమ్మ ఇళ్ల విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంత్రి శ్రీధర్ బాబు చొరవ**

**-గ్రామ ప్రజల కష్టాలపై వెంటనే స్పందించిన మంత్రికి ,అధికారులకు కృతజ్ఞతలు**

**- మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి**



రామగిరి, మే 12(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ సౌకర్యాల సమస్యలను మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఈడీ వెంకటరమణ తో మాట్లాడడం జరిగిందని మంత్రి ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం రోజున గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని తెలిపారు.గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన కరెంట్ పోల్స్, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఈడీ వెంకటరమణ, ఏఈ మహేందర్ రెడ్డి, లైన్‌మన్ శ్రీనివాస్ గ్రామంలో పరిశీలన అనంతరం తెలిపారు. అలాగే త్వరితగతిన ఎస్టిమేట్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు విద్యుత్ వెలుగులు అందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి, ఈడీ వెంకటరమణ, ఏఈ మహేందర్ రెడ్డి లకు మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ


**దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖాదేమీ మృతి**

టెహ్రాన్,ఏప్రిల్ 6 : ట్రంప్ బెదిరింపుల వేళ ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ తగిలింది. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖాదేమీ మరణించారు. ఈ విషయాన్ని ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. అయితే ఆయన ఎక్కడ హతమయ్యాడనేది వెల్లడించలేదు. టెహ్రాన్‌లోని నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సోమవారం ఉదయం ఈ దాడులు చోటుచేసుకున్నాయి. అమెరికన్-జియోనిస్ట్ శత్రువు తెల్లవారుజామున జరిపిన క్రిమినల్ టెర్రరిస్ట్ దాడిలో తమ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ మజీద్ ఖాదేమీ మరణించారని, ఆయన తన ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక వ్యక్తి అని ఐఆర్‌జీసీ వెల్లడించింది.

# వేధింపులపై ఏఐ గురి



అన్నిరంగాల్లో తనదైన ముద్రవేస్తున్న కృత్రిమ మేధ.. మహిళలకూ అండగా నిలుస్తున్నది. కార్యాలయాల్లో వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తున్నది. సమస్యను గుర్తించడం, నిరోధించడంతోపాటు పరిష్కరించడంలోనూ సాయపడుతున్నది. ఏళ్లకేళ్లుగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కార్యాలయాల్లో మహిళలపై వేధింపులు తగ్గడం లేదు. కౌన్సెలింగ్‌లు, శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ.. 'వేధింపులు' నిరంతర సమస్యగా కొనసాగుతున్నాయి. అయితే, ఈ విషయంలో బాధితుల్లో చాలామంది మౌనంగానే ఉండిపోతున్నారు. పరువు పోతుందనీ, కెరీర్ ఇబ్బందిలో పడుతుందని ఫిర్యాదులు చేయడానికి భయపడుతున్నారు. ధైర్యంగా ఫిర్యాదు చేసినా.. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉండటం లేదు. ఈ సమస్యకు.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మంచి పరిష్కారం చూపుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో నెమ్మదిగా, పక్షపాతంగా సాగే మానవ జోక్యంపై ఆధారపడటానికి బదులుగా.. 'ఏఐ'తో తక్షణ న్యాయం పొందొచ్చని అంటున్నారు. ఇప్పటికే ఉమ్‌వెల్ట్.ఏఐ రూపొందించిన ఏఐ ఆధారిత 'చీఫ్ లైజనింగ్ ఆఫీసర్' నిక్కీ.. కార్యాలయాల్లో వేధింపులపై నివేదికలు రూపొందిస్తున్నది. ఉద్యోగుల మనోభావాలను విశ్లేషించడంతోపాటు మహిళల అభిప్రాయాలనూ సేకరిస్తుంది. ఈ మెయిల్స్ చెక్ చేయడం, చాట్ సెషన్లను స్కాన్ చేయడం ద్వారా.. ఎవరైనా వేధింపులకు గురవుతున్నారా అని గుర్తిస్తుంది. వేధింపుల కేసుల్లోని అతిపెద్ద సమస్యలు.. రిపోర్టింగ్, పక్షపాతం. చాలాచోట్ల ఉన్నతోద్యోగులు తనవాళ్లకు అండగా నిలుస్తుంటారు. కానీ, ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్.. ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారిస్తుంది. లింగం, విభాగం, సీనియారిటీ లాంటి గుర్తింపులను తొలగిస్తుంది. కేసులను వాస్తవాల ఆధారంగా సమీక్షిస్తుంది. తద్వారా బాధితులకు న్యాయం జరుగుతుంది. ప్రతీకార భయంతో వేధింపులపై ఫిర్యాదు చేయడానికి చాలామంది ముందుకు రావడంలేదు. అయితే, ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్లు.. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతాయి. బాధితులకు కావాల్సిన చట్టపరమైన సలహాలను అందిస్తాయి. వారి మానసిక స్థితి మెరుగుపడేందుకు కావాల్సిన కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తాయి. మరికొన్ని ఆధునిక ఏఐ వ్యవస్థలు.. ఉద్యోగుల్లో అనుచిత ప్రవర్తననూ గుర్తిస్తున్నాయి. ఇబ్బందికరంగా ప్రవర్తించేవారిపై ఓ కన్నేసి ఉంచుతున్నాయి. అలాంటివారిపై ఫిర్యాదులు అందితే.. తక్షణమే తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నాయి.



# ఇంటర్వెల్ వాకింగ్

జపాన్‌వాసులు ఏది చేసినా పద్ధతిగానే ఉంటుంది. టెక్నాలజీ, ఆహారం, క్రమశిక్షణ.. ఇలా ఏ విషయం తీసుకున్నా ప్రత్యేకంగానే నిలుస్తుంది. ఇప్పుడు వాకింగ్‌లోనూ.. మరో కింగ్‌లాంటి పద్ధతిని తీసుకొచ్చారు. అదే.. ఇంటర్వెల్ వాకింగ్. మామూలు నడకతో పోలిస్తే.. ఈ ఇంటర్వెల్ వాకింగ్ ద్వారా మరిన్ని అదనపు ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. వేగాన్ని మార్చుకుంటూ నడక సాగించడమే ఇంటర్వెల్ వాకింగ్ పద్ధతి. మొదటగా వాచ్ లేదా ఫోన్‌లో మూడు నిమిషాల వ్యవధితో టైమర్‌ను సెట్ చేసుకోవాలి. నడకను ప్రారంభించి.. మొదటి మూడు నిమిషాలపాటు నెమ్మదిగా కొనసాగించాలి. ఆ తర్వాతి మూడు నిమిషాలు వేగంగా నడవాలి. మళ్లీ మూడు నిమిషాలు వేగాన్ని తగ్గించాలి. ఇలా 30 నిమిషాల పాటు వేగాన్ని తగ్గిస్తూ. పెంచుతూ నడక సాగించాలి. అనేక ప్రయోజనాలు.. ఇప్పటివరకు రోజుకు 10వేల అడుగులు వేయడమే నడకలో ఉత్తమమైన వ్యాయామంగా గుర్తింపు పొందింది. అయితే, ఎన్ని అడుగులు వేయాలన్న విషయాన్ని పక్కన పెడితే.. జపాన్‌వాసులు ఫాలో అవుతున్న ఇంటర్వెల్ వాకింగ్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. మూడు నెలలపాటు వారానికి మూడుసార్లు.. 30 నిమిషాల ఇంటర్వెల్ వాకింగ్ చేసిన వారిలో రక్తపోటు, కొలెస్ట్రాల్ తగ్గినట్లు గుర్తించారు. వారి కాళ్లలో బలం పెరిగిందనీ, మామూలు వాకింగ్ చేసేవారితో పోలిస్తే వీరిలో ఏరోబిక్ సామర్థ్యం పెరిగినట్లు తేల్చారు. అంతేకాకుండా.. ఇంటర్వెల్ వాకింగ్‌లో ఎక్కువ కేలరీలు ఖర్చయ్యే అవకాశం ఉంది. వేగంగా నడిచే సమయంలో హృదయ స్పందన రేటు పెరుగుతుంది. దాంతో గుండె ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది.

## ఇవి తీసుకోండి... గ్రద్ద లాంటి కంటి చూపు మీ సొంతమవుతుంది!

కంటిచూపు మెరుగుపడటానికి, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా కొన్ని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఆరోగ్యానికి అవసరం. కంటి చూపు మెరుగుపడటానికి పోషకాహారం తీసుకోవాలి. విటమిన్ ఎ అధికంగా ఉండేవి: కంటి ఆరోగ్యానికి విటమిన్ ఎ అత్యంత ముఖ్యమైనది. ఇది రాత్రి దృష్టిని మెరుగుపరచడంతోపాటు కళ్లు పొడిబారడాన్ని నివారిస్తుంది. క్యారెట్లు: బీటా–కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. చిలగడదుంపలు: క్యారెట్ల మాదిరిగానే వీటిలో కూడా బీటా–కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఆకుకూరలు: పాలకూర, కాలే, తోటకూర, బచ్చలికూర వంటి ముదురు ఆకుపచ్చ కూరగాయలు తీసుకోవాలి. విటమిన్ ఏ కు మంచి వనరైన గుమ్మడికాయను కూడా తీసుకుంటుండాలి. గుడ్డు పచ్చ సొన, మామిడి, బొప్పాయిల్లో కూడా బీటా కెరోటిన్ ఉంటుంది. ల్యూటిన్, జియాక్సంతిన్: ఈ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కంటి రెటీనాలోని మక్యులా లో ఉంటాయి. ఇవి హానికరమైన నీలి కాంతిని ఫిల్టర్ చేసి, వయస్సు సంబంధిత మక్యులర్ డీజెనరేషన్, కంటిశుక్లం నుండి కంటిని రక్షిస్తాయి. ఆకుకూరలు: పాలకూర, కాలే, బచ్చలికూర తీసుకోవాలి. విటమిన్ సి : ఇది ఒక యాంటీఆక్సిడెంట్, ఇది కంటి రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది, కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. సిట్రస్ పండ్లు: నారింజ, నిమ్మ, బత్తాయి, ద్రాక్షపండ్లు తీసుకోవాలి. అలాగే ఉసిరికాయ, స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్బెర్రీలు తరుచుగా తీసుకోవాలి. విటమిన్ ఇ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది కంటి కణాలను ఆక్సీకరణ నష్టం నుండి రక్షించి, కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నట్స్, బాదం, వాల్‌నట్‌లు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు తినాలి.

# మునక్కాయల ఆరోగ్య అద్భుతాలు చూస్తే వదిలిపెట్టరు!



మన ప్రకృతిలో ఆరోగ్యానికి దోహదం చేసే ఎన్నో కూరగాయలు ఉన్నాయి. కూరగాయలలో మునక్కాయలు ఒకటి . మునక్కాయల తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మునక్కాయలలో ఉండే పోషకాలు మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి. మునక్కాయల లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, ఫాస్ఫరస్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శక్తిని ఇవ్వడంతోపాటు మనం ఆరోగ్యంగా ఉండడానికి దోహదం చేస్తాయి. పాల ప్యాకెట్లపై పవన్ హరిహర వీరమల్లు ప్రచారం..! విజయ మిల్క్ క్లారిటీ..! నాలుగు రోజులు భారీ వర్షాలు – ఈ జిల్లాలకు తాజా హెచ్చరిక..!! 'వలపు వల'తో రూ.102 కోట్లు స్వాహా.. 80 వేల ఫోటోలు, వీడియోలు..సన్యాసులే టార్గెట్..! డయాబెటిస్, హై బీపీ కంట్రోల్ చేయటానికి మునక్కాయలు మునక్కాయ లతో డయాబెటిస్ కు చెక్ పెట్టవచ్చు. మునక్కాయల లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేయడానికి దోహదం చేస్తాయి. మునక్కాయ లతో హైబీపీని కంట్రోల్ చేసుకోవచ్చు. ఇందులో ఉండే పొటాషియం అధిక రక్తపోటును నివారించడానికి దోహదం చేస్తుంది. మునక్కాయల లో ఉండే క్యాల్షియం, ఫాస్ఫరస్ వల్ల ఎముకలకు బలం చేకూరుతుంది. మునక్కాయల లో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణక్రియకు దోహదం చేస్తుంది.గుండె జబ్బులు, చర్మ ఆరోగ్యానికి రక్షణ మునక్కాయలు మునక్కాయలు మన శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు కావలసిన శక్తిని అందిస్తాయి. మునక్కాయలు తినడం వల్ల ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత వ్యాధులను నివారించడానికి దోహదం చేస్తాయి. మునక్కాయలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. మునక్కాయలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మం యంగ్ గా ఉండేలా చేస్తాయి. మునక్కాయలతో కాలేయ, పేగుల ఆరోగ్యం మునక్కాయలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదం చేస్తాయి. అలసటను తగ్గించి శరీరానికి కావలసిన శక్తిని ఇస్తాయి. మునక్కాయలు పేగుల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. వాపులు, ఇన్ఫెక్షన్లు, గాయాలు వంటి వాటిని తగ్గించడానికి దోహదం చేస్తాయి. మంచి కంటి చూపును అందిస్తాయి. అంతేకాదు మునక్కాయలు తరచూ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల పురుషులలో లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. 650 మందికి మర్చిపోలేని సాయం చేసిన స్టార్ హీరో..! రోజా కోసం రంగంలోకి శ్యామల.. పవన్ కళ్యాణ్ కు సంచలన డిమాండ్! 'నిధి' పాప బంగారం.. ఒక్క రోజులోనే 15కి పైగా ఇంటర్వ్యూలు ! %ూశ్రీంశీ =ఘుం% అతిగా నిద్రిస్తున్నారా? అయితే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే మునక్కాయలు ఇలా తింటే మంచిది మునక్కాయలు తినటంతో శారీరక అనారోగం గణనీయంగా తగ్గుతుంది .. ఇన్ని గొప్ప లక్షణాలు ఉన్న మునక్కాయలను అతిగా తినకుండా, అప్పుడప్పుడు ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది. ఇన్ని అద్భుత పోషకాల ములక్కాయలను వివిధ రకాల కూరగాలతో కూడా కలిపి వండుకోవచ్చు.

# మార్కెట్

## యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలో కొత్త సపోర్ట్ చాట్ ఫీచర్‌ను తీసుకురానున్న వాట్సాప్..!

ఐఓఎస్ యూజర్లకు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పెషల్ సపోర్ట్ చాట్ ద్వారా ఏఐ యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నది. ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ యాప్ తాజా వెర్షన్‌లోకి రాగా.. రాబోయే వారాల్లో మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ సపోర్ట్ చాట్ కోసం మొదట వాట్సాప్ సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో హెల్ప్ బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో హెల్ప్‌సెంటర్ బటన్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్ అస్ పై క్లిక్ చేసి యాక్సెస్ చేయొచ్చు. దాంతో యూజర్లు అధికారిక వాట్సాప్ సపోర్ట్ ఖాతా అని సూచించే మెటా వేరిఫైడ్ బ్లూ టిక్‌తో కొత్త చాట్ విండో ఓపెన్ అవుతుంది.



# వేగంగా విస్తరిస్తున్న భారత ఈవీ కార్ల మార్కెట్..



2028 నాటికి 7శాతం దాటనున్న వాటా..! భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నది. సరఫరా గొలుసులోని, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌కు సంబంధించిన సమస్యలు సకాలంలో పరిష్కరించగలిగితే 2028 ఆర్థిక సంవత్సరానికి భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7శాతాన్ని దాటుతుందని ఓ నివేదిక పేర్కొంది. అమెరికన్ ఈవీ కంపెనీ టెస్లా భారత్లోకి ప్రవేశించినట్లు అధికారికంగా ప్రకటించిన కేర్ ఏజ్ అడ్వైజరీ ఈ నివేదికను విడుదల చేసింది. గత కొద్దిరోజులుగా భారత్‌లోని ఎలక్ట్రికల్ కార్ల అమ్మకాల్లో విపరీతంగా పెరుగుతున్నది. నివేదిక ప్రకారం.. 2021 ఆర్థిక సంవత్సరంలో 5వేల యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య 1.07లక్షలు దాటింది. అయితే, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలకే ఇప్పటికీ ఈవీ మార్కెట్‌లో పెద్ద వాటా ఉన్నది. పరిశ్రమకు లభిస్తున్న మద్దు కారణంగా ఫోర్ వీలర్స్ విభాగం సైతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ సమస్యలు పరిష్కరించగలిగితే భారత్‌లో ఈవీ అమ్మకాలు 2028 ఆర్థిక సంవత్సరానికి 7శాతం దాటే అవకాశం ఉంటుందని కేర్‌ఏజ్ సీనియర్ డైరెక్టర్ తన్వి షా పేర్కొన్నారు. కొత్త మోడల్స్, చార్జింగ్ మౌలిక సదుపాయాల పెరుగుదల, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం కింద బ్యాటరీ స్థానికీకరణ కారణంగా భారత్‌లో ఈవీ రంగానికి గొప్ప అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఫేమ్–3, అధునాతన బ్యాటరీల కోసం పీఎల్ఐ పథకం, బ్యాటరీ ముఖ్యమైన ఖనిజాలపై కస్టమ్ సుంకం మినహాయింపు వంటి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా సరఫరాలో గొలుసు బలోపేతమయ్యేందుకు, ఖర్చులు తగ్గించేందు సహాయపడనున్నాయి. ఈవీలు ఎదుర్కొంటున్న పెద్ద సవాల్ పబ్లిక్ చార్జింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడం. ప్రస్తుతం చార్జింగ్ మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి. 2022 నాటికి భారత్‌లో 5,151 పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఉండగా.. 2025 ప్రారంభానికి ఈ సంఖ్య 26వేలు దాటింది. ఈ వృద్ధి రేటు ఏటా 72 శాతానికి పైగా ఉంది. మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలు ప్రోత్సాహకాలు (భూమి, సబ్సిడీ) ఇస్తున్నాయి. అలాగే, మున్సిపల్ కార్పొరేషన్లు ఇప్పుడు నివాస, వాణిజ్య ప్రాజెక్టుల్లోనూ ఈవీ పార్కింగ్స్‌ను తప్పనిసరి చేస్తున్నాయి. దాంతో వాహనదారుల ఆందోళనలు కొంత వరకు తగ్గుతున్నాయి. ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు (%జూాం%) సైతం తమ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తున్నారు. ప్రభుత్వాలు, పలు సంస్థల భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నారు. అదే సమయంలో బీఈఈ, నీతి ఆయోగ్ వంటి జాతీయ సంస్థలు ఛార్జర్ స్టాండర్డైజేషన్, ఇంటర్‌ఆపరేబిలిటీపై పనిచేస్తున్నాయి. తద్వారా ఛార్జింగ్ ఎక్స్‌ప్రీరియన్స్ సులభం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ఈవీ బ్యాటరీలకు అవసరమైన 16 ఖనిజాలపై ప్రైమరీ కస్టమ్ సుంకాన్ని తొలగించింది. దాంతో ఖర్చులు మరింత తగ్గనున్నాయి. దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యం పెరుగనున్నది. నివేదిక ప్రకారం.. 2022 ఆర్థిక సంవత్సరంలో భారత్ 100 శాతం లిథియం అయాన్ సెల్ దిగుమతులపై ఆధారపడి ఉండగా.. 20227 నాటికి ఇది 20శాతానికి పడిపోయే అవకాశం ఉంది. ఎందుకంటే దేశంలో బ్యాటరీ తయారీలో పెద్ద పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వ విధానాలు, సాంకేతిక పురోగతి, టెస్లా వంటి టాప్ కంపెనీల ప్రవేశంతో భారతదేశ ఈవీ మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.




## కెడిట్ కార్డులపైనే ఆధారం..


దేశంలో అల్పాదాయ వర్గాల అవసరాలకు క్రెడిట్ కార్డులే దిక్కవుతున్నాయి. నెలకు రూ.50 వేల కంటే తక్కువ సంపాదిస్తున్న ఉద్యోగుల్లో దాదాపు 93 శాతం మంది క్రెడిట్ కార్డులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్టు తమ అధ్యయనంలో తేలిందని గ్లోబల్ ఫుల్–స్టక్ డాటా సైన్స్, ఏఐ ఆధారిత సంస్థ థింక్360.ఏఐ మంగళవారం తెలియజేసింది. గడిచిన ఏడాదికిపైగా కాలంలో 20 వేలకుపైగా ఉద్యోగులు, స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న వ్యక్తుల జీవన శైలి, ఆర్థిక అవసరాలు, అభిప్రాయాల ఆధారంగా ఈ అధ్యయనం రూపొందించినట్టు పేర్కొన్నది. ఈ సందర్భంగా స్వయం ఉపాధితో జీవిస్తున్న 85 శాతం మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు.



# హరిహరవీరమల్లు పార్ట్ 2 మరింత పవర్‌ఫుల్

### ప్రమోషన్లలో పాల్గొంటున్న నిధి అగర్వాల్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా రూపొందిన చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రం 'హరి హర వీరమల్లు'జులై 24న గ్రాండ్ రిలీజ్ కానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో పవన్ అంత యాక్టివ్‌గా పాల్గొనడం లేదు. దర్శకుడు క్రిష్ మిడ్‌స్టేజ్‌లో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఆయన కూడా ప్రమోషన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. జ్యోతికృష్ణ ప్రస్తుతం ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల్లో ఆయనకు గుర్తింపు తక్కువగా ఉండడంతో పెద్దగా బజ్ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మొత్తం ప్రమోషన్ బరువు బాధ్యతలు నిధి అగర్వాల్ భుజాలపై పడింది. పంచమి పాత్రలో మెప్పిస్తున్న నిధి, గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ సినిమాపై భారీ నమ్మకంతో ఎదురుచూస్తోంది. ఈ సినిమాతో ఆమె రేంజ్ మారుతుందని ఫ్యాన్స్ కూడా భావిస్తున్నారు. ఇక సినిమాకి సంబంధించిన ప్రతి ప్రమోషన్ కార్యక్రమంలో నిధి యాక్టివ్‌గా పాల్గొంటుంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్, 'హరి హర వీరమల్లు'తో పాటు- పార్ట్ 2 గురించి కూడా కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించింది. మొదట సినిమాను ఒకే పార్ట్‌గా రూపొందించాలనుకున్నప్పటికీ, కథ విస్తృతంగా ఉండటంతో రెండు భాగాలుగా చేయాలని నిర్ణయించారని తెలిపింది. ఇప్పటికే పార్ట్ 2కి సంబంధించిన 20 నిమిషాల సీన్స్ షూట్ పూర్తయ్యాయని చెప్పి అభిమానులని ఆనందింపజేసింది. నిధి చెప్పిన ప్రకారం, వీరమల్లు పార్ట్ 2లో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే, రెండో భాగం మరింత పవర్‌ఫుల్‌గా ఉంటుందని తెలియజేసింది. అయితే షూటింగ్ మిగతా భాగం ఎప్పుడవుతుందనేది మాత్రం ఇంకా స్పష్టత లేదు. పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో పార్ట్ 1 హిట్ అయితేనే పార్ట్ 2పై క్లారిటీ- వచ్చే అవకాశం ఉంది.ఏఎం రత్నం నిర్మాణంలో, క్రిష్ మరియు జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.




# రామాయణ బడ్జెట్ నాలువేల కోట్లు

### సంచలన వివరాలు వెల్లడించిన నిర్మాత

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారీ రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. తాజాగా దీని బడ్జెట్‌ను నిర్మాత నమిత్ మల్హోత్రా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఏకంగా రూ.4000 కోట్లతో దీన్ని నిర్మించనున్నట్లు- చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇప్పటివరకూ ఇంత భారీ బడ్జెట్‌తో భారతీయ సినిమాలు తెరకెక్కలేదన్న నమిత్ 'రామాయణ' చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందన్నారు. మేం ఈ సినిమా కోసం నిధులు సమకూర్చుకుంటున్నాం. ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోవాలని అనుకోవడం లేదు. ఏడు సంవత్సరాల క్రితమే మేం దీని పనులు ప్రారంభించాం. కొవిడ్ తర్వాత దీన్ని ప్రారంభించినప్పుడు ప్రజలు నన్ను పిచ్చివాడిని అనుకున్నారు. ఏ భారతీయ సినిమా కూడా 'రామాయణ' దరిదాపుల్లోకి రాలేదు. రెండు భాగాలు రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4000 కోట్లతో రూపొందించనున్నాం. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం. హాలీవుడ్ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే ఇది తక్కువే అని నేను భావిస్తున్నాను. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే అని నిర్మాత తెలిపారు. భారతీయ సినిమాపై ప్రపంచం చిన్నచూపు చూసినప్పుడు తాను నిరాశకు గురవుతానన్నారు నమిత్ మల్హోత్రా. 'రామాయణ' ప్రాజెక్ట్‌తో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుందన్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా బడ్జెట్‌పై ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. రూ.835 కోట్లతో రానుందని టాక్ వినిపించింది. తర్వాత రూ.1600 కోట్లని.. మొదటిభాగం రూ.900 కోట్లతో రానుందని.. రెండోది రూ.700 కోట్లని కథనాలు వెలువడ్డాయి. ఇప్పుడు వాటన్నిటికీ చెక్ పెడుతూ నిర్మాతే అధికారికంగా దీని బడ్జెట్‌ను రివీల్ చేయడం వైరల్‌గా మారింది. ఇక ఇందులో ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్న విషయం తెలిసిందే.



## జానకి వర్సెస్ కేరళ

# పేరు మార్పు

మలయాళంలో అనుపమ పరమేశ్వరన్, సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం జానకి వర్సెస్ కేరళ టైటిల్ చుట్టూ నెలకొన్న వివాదం చివరకు ముగిసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సూచనలతో మేకర్స్ -టైటిల్ మార్చేందుకు అంగీకరించారు. 'జానకి వర్సెస్ కేరళ' అనే టైటిల్ రాష్ట్రాన్ని లక్ష్యం చేస్తుందని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టైటిల్ మార్పును సూచించగా, దాన్ని నిర్మాతలు ఆమోదించారు. దీంతో సినిమా కొత్త టైటిల్‌గా 'జానకి వి స్టేట్ ఆఫ్ కేరళ' ను ఫిక్స్ చేశారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలైంది. ఇందులో కథానాయిక జానకి విద్యాదరన్ (అనుపమ పరమేశ్వరన్) పై జరిగే లైంగిక దాడి, ఆ తర్వాత ఆమె న్యాయానికి కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఇది సమాజంలో మహిళల ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేస్తూ, చట్ట వ్యవస్థపైనా ఓ బలమైన సందేశం ఇస్తుందని అర్థమవుతోంది. ఈ చిత్రంలో దివ్య పిళ్ళై, శృతి రామచంద్రన్, అస్కర్ అలీ, మాధవ్ సురేష్ గోపి, బైజు సంతోష్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కాస్మోస్ ఎంటర్-టైన్‌మెంట్స్ పతాకంపై జె. ఫణీంద్ర కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. త్వరలో సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు.




# ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ పౌరాణిక చిత్రం

### ఆసక్తికర విషయాలు వెల్లడించిన నాగవంశీ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినీ కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. గతేడాది దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తారక్ మరికొన్ని రోజుల్లో వార్ 2 చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాతో బాలీవుడ్ మార్కెట్‌లోనూ తన సత్తా చాటనున్నాడు. హృతిక్ రోషన్‌తో కలిసి చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఆగష్టు 15న విడుదల కానుండగా, అభిమానులు సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇదే కాకుండా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్-టైనర్ ఒకటి చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా.. దీనికోసం ఎన్టీఆర్ బరువు కూడా చాలా తగ్గాడు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సినిమా చేయబోతున్నట్లు- వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. మైథాలాజికల్ మూవీగా రానున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించబోతున్నాడు. సుబ్రహ్మణ్య స్వామి కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయాల గురించి పంచుకున్నాడు నాగవంశీ. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా చేస్తున్నారు. అందుకే ఈ సినిమాను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో ఈ సినిమా లాంఛింగ్‌తో పాటు శరవేగంగా షూటింగ్ ఉంటుంది. త్రివిక్రమ్-వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ఈ సినిమా ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాతే ఎన్టీఆర్ ప్రాజెక్ట్ మొదలవుతుందని తెలిపాడు. త్రివిక్రమ్-ఎన్టీఆర్ సినిమా ప్రకటించడానికి భారీ స్థాయిలో ప్లాన్ చేశాం. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా తీస్తున్నారు. సీనియర్ ఎన్టీఆర్‌ను రాముడిగా, కృష్ణుడిగా చూశాం. ఇప్పుడు తారక్‌ను నేను అలా చూపించనున్నాను. 'రామాయణ'ను ప్రకటించిన తర్వాత దేశమంతా దాని గురించి మాట్లాడుకుంది. దానికంటే భారీగా మా సినిమాను ప్రకటించాలని కొన్ని రోజులు ఆపాం. ఇప్పుడు ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో దీన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాం. త్రివిక్రమ్-వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాత దీని పనులు మొదలవుతాయని నాగవంశీ చెప్పారు. ఇక విజయ్ దేవరకొండను ప్రేక్షకులు ఎందుకు టార్గెట్ చేస్తారో కూడా తెలియదని నాగవంశీ అన్నారు. ఆయన ప్రస్తుతం తన సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేకపోతున్నాయని బాధ పడుతున్నట్లు- చెప్పారు. ఆయన ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు.

# చిత్ర పరిశ్రమపై సెటైరికల్ మూవీ ఫంకీ

విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫంకీ' సినిమా గురించి కీలక విషయాలను వెల్లడించారు నిర్మాత నాగవంశీ. ఈ సినిమా చిత్ర పరిశ్రమపై సెటైరికల్‌గా తెరకెక్కుతుందని ఇందులో విశ్వక్ దర్శకుడి పాత్రలో కనిపించబోతున్నారని విశ్వక్ తెలిపాడు. జాతిరత్నాలు, ప్రిన్స్ వంటి కామెడీ సినిమాలను తెరకెక్కించిన కేవీ అనుదీప్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాలో తమిళ నటి కాయదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా.. ప్రస్తుతం ఆమె డేట్స్ కోసం ఎదురుచూస్తున్నామని నాగవంశీ తెలిపాడు. ఫంకీలో ఇప్పటివరకు వచ్చిన అవుట్‌పుట్ చాలా బాగా వచ్చిందని నాగవంశీ అన్నారు. ఈ సినిమా విశ్వక్ సేన్ కెరీర్‌కు, అలాగే దర్శకుడు కేవీ అనుదీప్‌కు చాలా ముఖ్యమైన చిత్రంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



# కుబేరనుంచి శంకరా సాంగ్ విడుదల

జూన్‌లో బాక్సాఫీసు ముందుకొచ్చి, ప్రేక్షకాదరణ పొందిన సినిమాల్లో 'కుబేర' ఒకటి. నాగార్జున , ధనుష్ , రష్మిక ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈ నెల 18 నుంచి ఓటీటీ- 'అమెజాన్ ప్రైమ్ వీడియో' లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో.. చిత్ర బృందం ఆడియన్స్‌కు సర్‌ప్రైజ్‌లు ఇస్తోంది. ఈ సినిమాలోని సాంగ్స్ ఫుల్ వీడియోలను రిలీజ్ చేస్తోంది. 'నాది నాది నాదే ఈ లోకమంతా' వీడియో సోమవారం విడుదల కాగా.. 'శంకరా' వీడియో సాంగ్ మంగళవారం విడుదలైంది.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com